సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



బహుదూరపు బాటసారులు

లోకేశ్వరం మండలం రాజూర, వట్టోలి, ధర్మోర, కన్కాపూర్ గ్రామాల గొర్రెల కాపరులు బహుదూరపు బాటసారులు. ఏడాదిలో మూడు నెలలు మందెంట సంచారం చేస్తారు. 8లో▸



సాలేగూడలో తాగునీటి కష్టాలు

సాలేగూడ గ్రామస్తులు తాగునీటికి తండ్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాక కిలోమీటర్ దూరంలో ఉన్న బోర్‌బావి నుంచి తెచ్చుకుంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: నిరుపేదల వైద్య ఖర్చులను ప్రభుత్వమే పూర్తిగా భరించాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.20 లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఇందులో నాయకులు సంతోష్, దయాకర్, సత్యం, కరుణాకర్‌రెడ్డి, రమేశ్, దేవన్న, రవిరెడ్డి, మహేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ కాలే సతీశ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కళ్లెం వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ బండి సాయి కృష్ణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు డాక్టర్లు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన వారం రోజుల్లో జిల్లా సైబర్ కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. బాధితులు వెంటనే 1930లో సంప్రదించాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గోల్డెన్ అవర్(గంట) లోపు ఫిర్యాదు చేసినట్లైతే బాధితులకు పూర్తి న్యాయం జరుగుతుందని తెలిపారు. ఏఐ ఆధారిత వీడియో కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'పత్తి రైతులను మోసం చేసేలా కేంద్రం కుట్ర'

ఆదిలాబాద్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పత్తి రైతులను మోసం చేసేలా వ్యవహరిస్తోందని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి లంకా రాఘవులు ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సీసీఐ పత్తి కొనుగోళ్లకు సంబంధించి కొత్త నిబంధనలు విధిస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తేమశాతం పేరిట కొర్రీలు పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇక్కడి రైతులు ఇప్పటికే అతివృష్టి కారణంగా పంట దిగుబడిపై ఆశలు సన్నగిల్లి ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోళ్లు సైతం జరగకపోతే వారు మరింత నష్టపోవాల్సి వస్తుందన్నారు. సీసీఐ లేకుంటే ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు పత్తిని కొనేలా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కేంద్రం వెంటనే సీసీఐ ద్వారా కొనుగోళ్లను చేపట్టాలని డిమాండ్ చేశారు.

దండారీకి రావాలని ఆహ్వానం

భీంపూర్: మండలంలోని భగవన్‌పూర్ గ్రామస్తులు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆయన కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దీపావళి పురస్కరించుకొని గ్రామంలో నిర్వహించనున్న దండారీ ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇందులో గ్రామ పెద్దలు మక్కు పటేల్, భగవండ్లు, శేఖవంత్, రాంజీ, తదితరులున్నారు.

బతుకమ్మ సంబురం



బతుకమ్మతో చిన్నారి



తాంసిలో హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మహాలక్ష్మి రూపంలో బతుకమ్మ



బతుకమ్మల వద్ద మహిళలు



దేవాపూర్‌లో నిమజ్జనానికి తరలిస్తూ..



బతుకమ్మలను వాగులో నిమజ్జనం చేస్తున్న మహిళలు

జిల్లాలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. తాంసి, తలమడుగు మండలాల్లో శనివారం పూల వేడుకలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను గద్దెల వద్ద ఉంచి ఉయ్యాల పాటల నడుమ ఆడబిడ్డలు చప్పట్లతో సందడి చేశారు. అనంతరం డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా బయలుదేరి పోయిరా బతుకమ్మ అంటూ గంగమ్మ ఒడికి చేర్చారు. పూల సింగిడిని సమీపంలోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. తాంసి, హస్నాపూర్, పొన్నారి గ్రామాల్లో వీడీసీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. తాంసిలోని హనుమాన్ ఆలయం వద్ద మహిళలు సామూహికంగా ఆడి అలరించారు. తలమడుగు మండలంలోని కజ్జర్ల, దేవాపూర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆడబిడ్డలు భారీగా పాల్గొన్నారు. – తాంసి/తలమడుగు

మళ్లీ డీసీసీ వేడి

- కాంగ్రెస్‌లో మొదలైన సందడి
- నేడో, రేపో ఏఐసీసీ పరిశీలకుడి రాక
- పీసీసీ నుంచి ముఖ్య నేతల కోఆర్డినేషన్
- క్షేత్రస్థాయిలో పర్యటించి అభిప్రాయ సేకరణ
- ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



జిల్లా పరిశీలకుడిగా రానున్న అజయ్ సింగ్

సాక్షి,ఆదిలాబాద్: కాంగ్రెస్‌లో మళ్లీ డీసీసీ అధ్యక్షుడి నియామక వేడి మొదలైంది. ఏఐసీసీ నుంచి పరిశీలకుడు రానున్నారు. నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి అభిప్రాయ సేకరణ చేయనున్నారు. పీసీసీ ముఖ్య నేతలు ఆయనతో సమన్వయం చేయనున్నారు. నేడో, రేపో వారు జిల్లాకు రానున్నట్లు చెబుతున్నారు. గతంలో కూడా అనేక సార్లు డీసీసీ అధ్యక్షుడి నియామకం విషయంలో పార్టీలో ప్రక్రియ జరిగినప్పటికీ ముందడుగు పడకపోవడం గమనార్హం. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ నుంచి పరిశీలకుడి రాక ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉమ్మడి జిల్లాలో..

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం ఏఐసీసీ నుంచి 22 మందితో పరిశీలకులను నియమించారు. వారు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటిస్తున్నారు. మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో సర్వేకోసం ఇప్పటికే పరిశీలకులు వచ్చేశారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో సర్వే కోసం ఏఐసీసీ నుంచి మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే అజయ్‌సింగ్‌ను నియమించారు. ఆయనతో పాటు పీసీసీ నుంచి రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, ప్రధాన కార్యదర్శులు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, సీహెచ్.రాంభూపాల్ కోఆర్డినేషన్ చేయనున్నారు. కాగా ఈ రెండు జిల్లాల్లో వారు బ్లాక్‌స్థాయిలో కార్యకర్తలతో సమావేశమై అభిప్రాయ సేకరణ చేయనున్నారు. అంతే కాకుండా ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఐదు రోజుల పాటు ఇక్కడే ఉండి ఈ రెండు జిల్లాల్లో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో డీసీసీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో ప్రస్తుతం ప్రక్రియ గట్టిగానే సాగుతుందనే చర్చ వినిపిస్తోంది.

ఆసక్తికరం..

కాంగ్రెస్‌లో ఏఐసీసీ నుంచి నేరుగా పరిశీలకులు రావడం, డీసీసీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో క్షేత్రస్థాయిలో పర్యటించనుండటంతో పార్టీలో ఇది ఆసక్తికరంగా మారింది. ప్రధానంగా బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తలను కలిసి వారి అభిప్రాయం సేకరించనుండటంతో ఇప్పుడు ఆశావహుల్లో టెన్షన్ కనిపిస్తోంది. కేవలం కార్యకర్తల నుంచే కాకుండా వ్యాపారులు, వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులను కూడా కలిసి అభిప్రాయ సేకరణ చేయనున్నారని పార్టీలో ప్రచారం సాగుతోంది. దీంతో ఆశావహులు ఎవరినైనా మేనేజ్ చేసి తమ పేరును పరిశీలకుడి ముందు గట్టిగా చెప్పించాలనుకునే ప్రయత్నాలకు ఎక్కడ కూడా అవకాశాలు ఉండకపోవచ్చని చెప్పుకుంటున్నారు. ప్రధానంగా ఈ కమిటీలకు పార్టీలో ముందుగానే శిక్షణ ఇచ్చి అభిప్రాయ సేకరణ ఏ విధంగా చేపట్టాలని పార్టీ దిశానిర్దేశం చేసిందని పేర్కొంటున్నారు. దీంతోనే ఈ ప్రక్రియపై ఇప్పుడు పార్టీలో అందరి దృష్టి నెలకొంది.

దరఖాస్తుకు సిద్ధమవుతున్న ఆశావహులు..

ప్రధానంగా ఇది వరకే పీసీసీ దృష్టిలో ఉన్న జాబితాలోని పేర్ల ఆధారంగా ఏఐసీసీ పరిశీలకులు క్షేత్రస్థాయిలో సర్వే చేయనున్నారని చెబుతున్నారు. పదవీ ఆశిస్తున్న నేతలు కూడా పరిశీలకులకు దరఖాస్తులను అందించేందుకు సిద్ధమవుతున్నారు.ప్రధానంగా ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్ష పదవిని ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోక గణేశ్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ ఆశిస్తున్నట్లుగా పార్టీలో ప్రచారం సాగుతుంది. తనకు అవకాశం ఇవ్వాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొ జ్జు కూడా దరఖాస్తు అందించేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు కూడా డీసీసీ అధ్యక్ష పదవీని ఆశిస్తున్నారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో అధ్యక్ష పీఠం కోసం కార్యకర్తలు ఎవరి పేరును సూచిస్తారనేది అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు.

'ఉపాధి' గ్రామ సభలకు వేళాయె

- రేపటి నుంచి ప్రారంభం
- వచ్చే ఆర్థిక సంవత్సరం పనుల గుర్తింపునకు ప్రణాళికలు
- భూగర్భజలాల పెంపునకు ప్రాధాన్యం

జిల్లాలో 2025–26 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల వివరాలు..

గ్రామ పంచాయతీలు	473
మొత్తం జాబ్‌కార్డులు	1,74,000
నమోదు చేసుకున్న కూలీలు	3,44,000
పనికి హాజరవుతున్న కూలీలు	2,07,000
కల్పించాల్సిన పనిదినాల లక్ష్యం	36.49లక్షలు
కల్పించిన పనిదినాలు	43.41లక్షలు

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు వంద రోజులు పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టాల్సిన పనులు గుర్తించేందుకు గ్రామసభల నిర్వహణకు సన్నద్ధమైంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నారు.

ప్రజాభీష్టం మేరకే పనుల ఎంపిక..

ఉపాధి పనుల్లో ప్రజలు, రైతులను భాగస్వాములను చేయనున్నారు. వారు కోరిన పనులు కల్పించేలా ప్రభుత్వం ఏటా గ్రామసభలు నిర్వహిస్తోంది. ఈనెల 2నుంచి నిర్వహించాల్సి ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా చేపట్టలేదు. తాజాగా కోడ్ ఎత్తివేయడంతో జిల్లాలో రేపటి నుంచి షురూ కానున్నాయి. ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు హాజరై రానున్న ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి పనులు కల్పించాలనే దానిపై గ్రామస్తులతో చర్చిస్తారు. గుర్తించిన పనులను కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు చదివి వినిపిస్తారు. తర్వాత ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు వాటికి సంబంధించిన అంచనాలు తయారు చేస్తారు. జాబ్‌కార్డుల ఆధారంగా పనులను నిర్ణయిస్తారు. పంచాయతీల వారీగా నివేదికలను మండల, జిల్లా పరిషత్‌లకు పంపించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం వాటికి పాలకవర్గాలు లేనందున కలెక్టర్‌కు నివేదిస్తారు. కలెక్టర్ వాటిని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి ప్రతిపాదిస్తారు. అక్కడి నుంచి అనుమతి వచ్చాక జిల్లాలో ఆయా పనులు చేపట్టి కూలీలకు ఉపాధి కల్పిస్తారు.



ఆదిలాబాద్‌రూరల్ మండలం వాన్వాట్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

భూగర్భజలాల పెంపు, పండ్ల తోటల పనులకు ప్రాధాన్యం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి హామీ పనుల్లో ప్రధానంగా భూగర్భజలాలు పెంపొందించడంతో పాటు వ్యవసాయపరంగా రైతాంగానికి మేలు చేకూర్చే పనులకు ప్రాధాన్యతనివ్వాలని అధికారులు నిర్ణయించారు. నీటి సంరక్షణకు సంబంధించి కుంటలు, చిన్నపాటి చెరువులు, స్టోన్ బండింగ్, గులకరాళ్ల ఏరివేత, పశువులు, మేకలు, గొర్రెల షెడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, నర్సరీల ఏర్పాటు రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు వీలుగా మట్టి రోడ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నారు. వీటితో పాటు రైతులకు అదనపు ఆదాయం చేకూర్చేలా పండ్లతోటలు, ఈత వనాలను పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. మార్కెట్‌లో డిమాండ్ కలిగిన మామిడి, కొబ్బరి, సీతాఫల్, జామా వంటి పండ్లతోటల పెంపకంతో పాటు నీలగిరి చెట్ల పెంపకానికి సంబంధించి అంచనాలను రూపొందించనున్నారు. వీటితో పాటు గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు వీలుగా వెదురు మొక్కల పెంపకం, అలాగే పాడి ఉత్పత్తి పెంచేలా పశువుల పాకల నిర్మాణాలకు సైతం ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

వంద రోజులు పని కల్పించడమే లక్ష్యం

వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2026–27)గాను ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఎలాంటి పనులు చేపట్టాలనే దానిపై చర్చించి ప్రణాళికను సిద్ధం చేయాల్సి ఉంది. సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నాం. ప్రజలకు అవగాహన కల్పించి ఎలాటి పనులు చేపట్టాలనే దానిపై వారి అభిప్రాయాలు తీసుకుంటాం. వాటి ఆధారంగా ప్రతీ కూలీకి వంద రోజుల పాటు పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తాం.
– కుటుంబరావు, అదనపు డీఆర్డీవో

రైతుల స్వయం సమృద్ధికి కేంద్రం కృషి

- ఎంపీ నగేశ్

ఆదిలాబాద్‌టౌన్: రైతులు స్వయం సమృద్ధి సాధించేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. రూ.42 వేల కోట్లతో దేశ వ్యాప్తంగా చేపట్టిన ధన్‌ధాన్య పథకాన్ని ప్రధాని శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి ప్రసంగాన్ని ఆలకించిన అనంతరం ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. దేశంలోని రైతులు స్వయం సమృద్ధి సాధించేలా కేంద్ర ప్రభుత్వం ధన్ ధాన్య పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. సాంకేతికత ఉపయోగిస్తూ రైతులు తమ పంట దిగుబడులను ఎగుమతి చేసేలా తయారు చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాం గోపాల్‌వర్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌స్వామి, మార్కెటింగ్ అధికారి గజానంద్, ఉద్యాన అధికారి నర్సయ్య, కేవీకే శాస్త్రవేత్తలు రఘువీర్, సురేష్,శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని ప్రసంగాన్ని తిలకిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్, అధికారులు

గురుకులాలపై ఫోకస్

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారిగా పీఎస్ఆర్.శర్మ
- సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే ప్రిన్సిపాళ్లతో సమావేశం
- చదువుతోపాటు మెనూ అమలుకు కసరత్తు

ఆదిలాబాద్‌టౌన్: సాంఘిక సంక్షేమ గురుకులాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతుంది. గురుకులాల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాలకు పది మంది ప్రత్యేకాధికారులను నియమించారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ కు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ సెక్రెటరీ పీఎస్ఆర్.శర్మ నియమితులయ్యారు. రెండు రోజుల క్రితం జిల్లాకు వచ్చిన ఆయన ఉమ్మడి జిల్లా పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజన్, విద్యార్థుల రక్షణపరంగా చర్యలతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించడం, పెండింగ్ అద్దెబిల్లులు వంటి సమస్యల పరిష్కారం కోసం అనుసరించాల్సిన కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.



జిల్లాకేంద్రంలోని బాలికల సంక్షేమ గురుకుల కళాశాల

జిల్లాలో..

జిల్లాలో నాలుగు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలున్నాయి. పట్టణంలో బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల అలాగే బాలికల డిగ్రీ కళాశాల, ఇచ్చోడలో బాలుర కళాశాల, బోథ్‌లో బాలికల డిగ్రీ కళాశాల ఉంది. ఒక్కో పాఠశాల/కళాశాలలో 640 మంది విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ కళాశాలలో 480 మంది చదువుతున్నారు. జిల్లాలో మొత్తం 2,400 మంది విద్యార్థులున్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

ఇటీవల గురుకుల సొసైటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన కృష్ణ ఆదిత్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన బోర్డులో పలు సంస్కరణలు తీసుకువచ్చారు. తాజాగా గురుకులాలపై ఫోకస్ పెట్టారు. ఈ ఏడాది మే నుంచి అద్దె భవనాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో యజమానులు భవనాలను ఖాళీ చేయాలని ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి తీసుకువస్తున్న విషయం తెలిసిందే. దీనిపై దృష్టి సారించిన ఆయన కళాశాలల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో 50మంది వరకు పార్ట్ టైం టీచర్లు, లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారు. అలాగే 30 మంది సిబ్బంది ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన విధులు నిర్వహిస్తున్నారు. మూడు నెలలుగా వీరికి వేతనాలు రావడం లేదు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని సదరు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం..

గురుకుల కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఫోకస్ పెట్టారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించే దిశగానూ దృష్టి సారిస్తున్నారు. ఈ విషయమై గురుకులాల జోనల్ అధికారి అరుణ కుమారిని సంప్రదించగా.. ఇటీవల మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో ఉమ్మడి జిల్లా ప్రిన్సిపాళ్లతో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సమావేశం నిర్వహించారని తెలిపారు. పలు అంశాలపై వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. అలాగే సమస్యలపై ఆరా తీసినట్లుగా వివరించారు.

బీసీలకు నాడు.. నేడూ నిరాశే!

- గత జెడ్పీటీసీ రిజర్వేషన్లలో ఒక్కటి కూడా దక్కలే
- ఎంపీపీ స్థానాల్లోనూ రెండింటికే పరిమితం
- ఈ సారి గణనీయంగా పెరిగినా కోర్టు స్టే తో బ్రేక్

బోథ్: జిల్లాలో బీసీల రాజకీయ భవిష్యత్తుకు అడ్డంకులు తప్పడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదనే ఆవేదన వారి నుంచి వినిపిస్తోంది. గత ఎన్నికల్లో రిజర్వేషన్లు దక్కక, ఈసారి దక్కినా కోర్టు స్టే కారణంగా బ్రేక్ పడడంతో తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

2019లో ఇలా..

2019 ఎన్నికల్లో జిల్లాలోని 17 మండలాల్లో ఒక్క జెడ్పీటీసీ స్థానం కూడా బీసీలకు రిజర్వ్ కాలేదు. ఎస్టీలకు 7, ఎస్సీలకు ఒక స్థానం కేటాయించగా.. రిజర్వేషన్లు 50శాతం మించరాదనే నిబంధనతో మిగిలిన 9 స్థానాలు జనరల్ అయ్యాయి. ఎంపీపీ స్థానాల్లో బీసీలకు కేవలం బేల, జైనథ్ సీట్లు మాత్రమే దక్కాయి. ఎస్టీలకు 7, ఎస్సీలకు ఒకటి, మిగతావి జనరల్‌కు కేటాయించారు.

తాజాగా పెరిగినా.. కోర్టు స్టేతో నిరాశే

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయంతో బీసీల్లో రాజకీయ ఆశలు చిగురించాయి. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవోనంబర్ 9ని జారీ చేసింది. దీంతో జిల్లాలో (20 స్థానాలు) బీసీలకు గణనీయమైన ప్రాతినిధ్యం దక్కింది. జెడ్పీటీసీ స్థానాలు 0నుంచి 8కి, ఎంపీపీ స్థానాలు 2 నుంచి 7కి పెరగడంతో వారిలో హర్షం వ్యక్తమైంది.

హైకోర్టు స్టేతో ఆశలు ఆవిరి

రిజర్వేషన్ల పెంపును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో న్యాయస్థానం ఈ జీవోపై స్టే విధించింది. ఫలితంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. జనాభాలో గణనీయంగా ఉన్న బీసీలకు రిజర్వేషన్ల పరిమితి పేరిట అన్యాయం జరుగుతోందని బీసీ సఘాలు పేర్కొంటున్నాయి. నాడూ..నేడూ నిరాశే మిగిల్చిందని వాపోతున్నారు.

బీసీలు నష్టపోతున్నారు



23 శాతం రిజర్వేషన్‌తో బీసీలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం 42 శాతం పెంచితే ఆనందపడ్డాం. జనాభాకు తగ్గట్టు ఫలాలు అందుతాయని ఆశపడ్డాం. కానీ కొందరు కోర్టులో కేసు వేసి మా నోటికాడ ముద్ద లాక్కున్నారు. జనాభా ప్రాతిపదికన మా వాటా మాకు దక్కాల్సిందే. – కలాల శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు



బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో కేసులు వేసి బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. సుదీర్ఘ పోరాటం తరువాత ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే అడ్డుకోవడం సరికాదు. బీసీలకు పదవులు వస్తుంటే ఓర్వలేకపోతున్నారు. రాజకీయంగా అణిచివేసేందుకే ఇదంతా చేస్తున్నారు. మాకు రావాల్సిన వాటా దక్కే వరకు ఉద్యమిస్తాం. – కరిపే శ్రీనివాస్, వంజరి సంఘం అధ్యక్షుడు, బోథ్

క్లుప్తంగా

ఇంట్లో చోరీ


బీరువాలో చిందరవందరంగా పడి ఉన్న వస్తువులు

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామంలో దుర్ల రాజలింగు ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సమీప బంధువులు చనిపోవడతో రాజలింగు కుటుంబంతో కలిసి మూడురోజుల క్రితం ఊరికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి ఉన్న కిటికీలోంచి లోపలికి చొరబడ్డారు. బీరువా తలుపులు పగులగొట్టి మూడు తులాల బంగారం, 25 వేల నగదును ఎత్తుకెళ్లారు. శనివారం స్థానికులు గమనించారు. వెంటనే అందించిన సమాచారంతో ఎస్సై గౌతమ్ పవర్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ బృందంతో తనిఖీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండోరోజు కొనసాగిన గాలింపు


పర్యవేక్షిస్తున్న డీఎస్పీ వహీదుద్దీన్

దహెగాం: మండలంలోని బొర్లకుంట గ్రామానికి చెందిన జుమ్మిడి మధుకర్ శుక్రవారం ఓ కార్యక్రమానికి వెళ్లి వాగులో స్నానం చేస్తుండగా గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో రెండోరోజు శనివారం గజ ఈతగాళ్లతో గాలింపు కొనసాగింది. సాయంత్రం చీకటిపడే వరకు ఆచూకీ లభ్యం కాలేదు. డీడీఆర్ఎఫ్ టీంతో గాలింపు చేపడతామని డీఎస్పీ వహీదుద్దీన్ తెలిపారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి రిమాండ్ తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..తలమడుగు మండలంలోని మందగూడకు చెందిన భీంరావు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. అదే మండలంలోని ఉమ్రికి చెందిన వరుసకు బావ మరిది అయిన కుమ్ర నగేశ్ అతనికి రిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రెండేళ్ల క్రితం రూ.20 వేలు తీసుకున్నాడు. ఇప్పటివరకు ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. ఫోన్ చేసిన, ఇంటికి వెళ్లిన స్పందించకపోవడంతో శనివారం బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని కుమ్ర నగేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

క్రీడా సంబురం

- గోలేటిలో ప్రారంభమైన సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలు
- తరలివచ్చిన క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన జీఎం విజయభాస్కర్‌రెడ్డి


క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి


తలపడుతున్న ఖమ్మం-వరంగల్ జిల్లా జట్ల క్రీడాకారులు

రెబ్బెన: క్రీడా సంబురం మొదలైంది. రెండు రోజుల పాటు జరిగే 11వ రాష్ట్రస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ సెపక్‌తక్రా పోటీలకు మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం వేదికైంది. రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులతో మైదానం కోలాహలంగా మారింది. శనివారం ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి క్రీడా పతకాలను ఆవిష్కరించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆపై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. సుమారు 200 మంది క్రీడాకారులు, 50 మంది కోచ్‌లు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు గోలేటి ప్రాంతం పుట్టినిల్లు లాంటిదని అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పోటీల్లో రాణిస్తూ మంచి గుర్తింపు పొందారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలను గోలేటిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

పీడీ కావడమే నా లక్ష్యం



పీడీ కావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. పదో తరగతి చదువుతూ సెపక్‌తక్రా పోటీల్లో రాణిస్తున్నాను. నేషనల్ పోటీల్లో ఒకసారి, నాలుగు సార్లు స్టేట్స్ మీట్‌లో పాల్గొన్నాను. రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో బ్రాంజ్ మెడల్స్ సాధించాను. రాష్ట్ర జట్టుకు, ఉమ్మడి వరంగల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాను. – బి.స్వప్న, వరంగల్

ఈ ఆట భిన్నమైనది



సెపక్‌తక్రా ఆట భిన్నమైనది. కేవలం కాళ్ల సహాయంతోనే ఆడాల్సి ఉంటుంది. నాలుగేళ్ల నుంచి ఆడుతున్నా. ఒకసారి నేషనల్స్‌కు సెలెక్ట్ అయ్యాను. ఇప్పటి వరకు మూడుసార్లు స్టేట్ మీట్‌లో ఆడితే ఒకసారి గోల్డ్‌మెడల్ సాధించాను. – నిఖిల్, వరంగల్

బంగారు పతకం సాధిస్తా



మూడేళ్లుగా సెపక్‌తక్రా ఆడుతున్నా. ఒకసారి నేషనల్స్‌లో, రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు సిల్వర్ మెడల్స్ సాధించాను. ఈసారి బంగారు పతకం సాధిస్తాను. – ఆర్.విష్ణువర్ధన్, మహబూబ్‌నగర్

సెపక్‌తక్రా అంటే ఇష్టం



నాకు సెపక్‌తక్రా అంటే ఎంతో ఇష్టం. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నా. 8వ తరగతి నుంచి ఆడటం నేర్చుకున్నా. ఆటపై ఉన్న ఇష్టంతో పోటీల్లో రాణిస్తున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో నాలుగు బంగారు, ఒకసారి వెండి పతకం సాధించాను. – పి.అభినవ్ రాజా, రంగారెడ్డి

ఫస్ట్‌ప్లేస్ సాధిస్తాం



సొంత జిల్లాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఫస్ట్‌ప్లేస్ సాధిస్తామనే నమ్మకం ఉంది. దానికి తగినట్లుగా ఆటతీరును ప్రదర్శిస్తాం. ఇప్పటి వరకు మూడు సార్లు స్టేట్ మీట్‌ను ఆడాను. త్వరలో గోవాలో జరగబోయే నేషనల్స్ పోటీల్లో పాల్గొనబోతున్నా. – అభినయ రమ్యశ్రీ, ఆదిలాబాద్

ఆత్మవిశ్వాసంతో ఆడుతాం



జిల్లా జట్టు క్రీడాకారులు ఆత్మ విశ్వాసంతో పోటీల్లో దిగుతున్నాం. ఇప్పటి వరకు ఒకసారి నేషనల్స్, మూడుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఒకసారి మూడోస్థానంలో సాధించాను. ఈసారి బంగారు పతకం సాధిస్తాను. – కె.రాంచరణ్, ఆదిలాబాద్

గతేడాది నుంచే ఆడుతున్నా



గతేడాది నుంచే సెపక్‌తక్రా మొదలుపెట్టాను. కోచ్, క్రీడాకారుల ప్రోత్సాహం ఇస్తున్నారు. గతంలో నేషనల్ పోటీల్లో పాల్గొన్నా ప్లేస్ రా లేదు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడోస్థానం సాధించాను. ఈసారి ఫస్ట్ ప్లేస్ కోసం ప్రయత్నిస్తున్నా. – సింగసాని అక్షిత, కరీంనగర్

జిల్లాకు చేరిన భారత్ అన్యశుద్ధి యాత్ర


కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకంతో గౌరవ్ త్యాగి

కైలాస్‌నగర్: దేశంలోని ప్రతి వ్యక్తికి శుద్ధమైన ఆహారం అందాలనే ఉద్దేశంతో గౌరవ్ త్యాగి అనే యువకుడు చేపట్టిన భారత్ అన్యశుద్ధి యాత్ర శనివారం జిల్లా కేంద్రానికి చేరింది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని హాపూర్ జిల్లా హైదర్‌పూర్‌కు చెందిన త్యాగి జూన్ 26న శ్రీనగర్‌లోని లాలౌచౌక్ నుంచి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టారు. బాల్య స్నేహితులు రాజత్ భారతి, రియాజ్‌తో కలిసి ప్రతీరోజుకు 25 నుంచి 30 కి.మీ పాదయాత్ర చేస్తున్నారు. ఇప్పటివరకు 12 రాష్ట్రాల్లో పాదయాత్ర పూర్తి చేసిన ఆయన మహారాష్ట్ర మీదుగా జిల్లాకు చేరుకున్నారు. పాఠశాల విద్యార్థులు, గృహిణిలు, రైతులను కలుస్తూ ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఇప్పటివరకు 50 వేల మంది చిన్నారులను కలిసి జంక్ ఫుడ్ తినొద్దని ప్రతిజ్ఞచేయించినట్లు తెలిపారు.

పోకిరీలకు కౌన్సెలింగ్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల వద్ద షీటీమ్ పోలీసులు మఫ్టీలో ఉండి డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద, మినీ బస్టాండ్ వద్ద శనివారం నలుగురు పోకిరీ యువకులను అదుపులో తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. షీ టీమ్ ఎస్సై ఉషారాణి, పోలీసులు శ్రావణ్‌కుమార్, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

- రాష్ట్ర అటవీశాఖ చీఫ్ కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి


పోటీలు ప్రారంభిస్తున్న అటవీ అధికారులు

నిర్మల్‌టౌన్: అటవీ ఉద్యోగుల్లో ఒత్తిడిని దూరం చేసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నామని రాష్ట్రఅటవీశాఖ చీఫ్ కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, వాకింగ్, చెస్, లాంగ్ జంప్, షాట్‌పుట్, క్యారమ్, జావలిన్ త్రో, తదితర క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ ఉద్యోగులకు మానసికోల్లాసం, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం కోసం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు సంబంధించిన సుమారు 350 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం వరకు పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వానన్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ డీఎఫ్‌ఓలు వికాస్ మీనా, రేవంత్ చంద్ర, నాగినిభాను, అధికారులు కుమారి చిన్న, సుధాకర్, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

4 కి.మీ కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి


కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన మంగ్లీ వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. మండల వైద్యాధికారి సర్ఫరాజ్, సిబ్బంది 4 కి.మీ కాలినడకన వెళ్లి శనివారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి మాత్రలు అందజేశారు. పిల్లలకు ఇమ్యూనైజేషన్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సర్ఫరాజ్ మాట్లాడుతూ గ్రామంలో 11 ఇళ్లు ఉండగా, 64 మంది జనాభా ఉన్నారని పేర్కొన్నారు. అనారోగ్యం బారినపడితే వెంటనే పీహెచ్‌సీకి, రిమ్స్‌కు వెళ్లి చికిత్స చేసుకోవాలన్నారు. అంకోలి పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ బొమ్మేత సుభాష్, హెల్త్ అసిస్టెంట్స్ వేణుతాయి, పవర్ ప్రేమ్‌సింగ్, రాథోడ్ నారాయణ, ఆశకార్యకర్తలు సుమిత్ర, రుక్మిణి, దుర్పత బాయి, గ్రామస్తులు ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు బలవన్మరణం చెందారు. బావిలో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మద్యానికి బానిసైన యువకుడు, వెన్నునొప్పితో బాధ పడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకున్నారు.

బావిలో దూకి ఒకరు..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రెండో ఎస్సై రామయ్య

లక్సెట్టిపేట: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన సాటేపల్లి మౌళి (32), సంజన దంపతులు. వీరికి పది నెలల కుమారుడు ఉన్నాడు. మౌళి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతకుతుండగా లక్సెట్టిపేట మండలం దొడపల్లి శివారులోని వ్యవసాయ బావి ఒడ్డున చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. బావిలో గాలించగా మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని రెండో ఎస్సై రామయ్య పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడవచ్చని తండ్రి లచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. ఆయన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

ఆదిలాబాద్‌టౌన్: మద్యానికి బానిసైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ కె.నాగరాజు కథనం ప్రకారం..పట్టణంలోని తాటిగూడకు చెందిన కుమ్ర రుషికేష్ (24) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకులు మందలించడంతో మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. తండ్రి ప్రభు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి..


నర్సయ్య (ఫైల్)

నర్సాపూర్(జి): వెన్నునొప్పితో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొల్లి నర్సయ్య (45), లక్ష్మి దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నర్సయ్య రెండేళ్లుగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నయంకాలేదు. ఈక్రమంలో జీవితంపై విరక్తితో శనివారం ఇంట్లో ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్



వెల్లడిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ నుంచి గంజాయి తీసుకువస్తున్నారనే సమాచారంతో జాతీయ రహదారి టోల్‌గేట్ వద్ద తనిఖీ చేపట్టారు. స్కూటీపై వచ్చిన ముగ్గురిని తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని స్కూటీతోపాటు వేల్పుల వర్షిత్ (పొన్నారం), వేల్పుల రాహుల్ (ఆదిల్‌పేట్), మణిదీప్ (నస్పూర్)ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బహుదూరపు బాటసారులు

- గొర్రెల మేత కోసం ఇతరప్రాంతాలకు కాపరులు
- ఏడాదిలో మూడునెలలు ఇంటికి దూరం
- వృత్తిని నమ్ముకుని జీవనం

నిర్మల్ జిల్లాలో..

జీవాలు	సంఖ్య
గొర్రెలు	3.50 లక్షలు
మేకలు	1.25 లక్షలు


ధర్మోర నుంచి మేతకు వెళ్తున్న గొర్రెలు


కాపరుల వంటావార్పు

వారంతా తమ కులవృత్తి అయిన గొర్రెల పెంపకాన్ని నమ్ముకొని జీవనం సాగించే యాదవులు. ఉన్న ఊరిలో జీవాలకు గ్రాసం దొరకకపోవడంతో పెంపకందారులు బృందంగా ఏర్పడి ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఏడాదిలో మూడు నెలలు అడవిలో ఉంటూ వండుకొని తింటారు. తమ జీవనోపాధితోపాటు జీవాల మేత కోసం వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్న బాటసారులపై ప్రత్యేక కథనం.

లోకేశ్వరం: మండలంలోని రాజూర, వట్టోలి, ధర్మోర, కన్కపూర్ గ్రామాల గొర్రెల కాపరులు బహుదూరపు బాటసారులు. ఏడాదిలో మూడు నెలలు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో గొర్రెల మందతోపాటు మేత కోసం తిరుగుతూనే ఉంటారు. నిర్మల్ జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాన్ని అనుకుని ఉండటంతో ఇక్కడి గొర్రెలు, మేకల పెంపకందారుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఎస్సారెస్పీ నిండనంత వరకు వెనుకభాగం పశుగ్రాసం లభిస్తుండటంతో రోజూ ఉదయం, సాయంత్రం వరకు జీవాలను మేపుతుంటారు. ఏటా జూలై, ఆగస్టులో ఎస్సారెస్పీ నిండుకుండలా మారుతుంది. వెనుకభాగం నీటితో నిండి ఉంటుంది. దీంతో జీవాలకు గ్రాసం దొరకక వలస వెళ్లాల్సిన పరిస్థితి. వీరంతా మళ్లీ వరి నూర్పిడి పూర్తయ్యే వరకు దాదాపు మూడునెలలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గుట్టలపై, నిజామాబాద్ జిల్లాలోని బాడ్సీ ప్రాంతాలకు వెళ్తారు. మండలాలకు చెందిన గొర్రెల కాపరులు బృందాలుగా ఏర్పడి మందలతో బయల్దేరుతారు. అడవిలో ఉంటూ వాటిని మేపుతూ అక్కడే వంట, భోజనాలు చేస్తారు. రాత్రి మందల వద్దే నిద్రిస్తారు. వంట సామగ్రి కోసం అక్కడి నుంచి కొందరు రావడమో, లేదంటే ఇక్కడి నుంచి వెళ్లేవారు వెంట తీసుకెళ్తారు.

తరచూ ప్రమాదాలు

సుదూర ప్రయాణం రోడ్డు మార్గంలో సాగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాలు ఢీకొని జీవాలు చనిపోతున్నాయి. ఇన్సూరెన్సు లేకపోవడంతో కాపరులు నష్టపోతున్నారు. ఇప్పటికైన పశుసంవర్ధక శాఖ అధికారులు పట్టించుకుని జీవాలకు ఇన్సురెన్సు చేసేలా చర్యలు తీసుకోవాలి.

పొలాల్లోనే నిద్ర

మండలంలోని రాజూర గ్రామానికి చెందిన 20 మంది కాపరులు, వట్టోలిలోని 10 కురుమ యాదవ, కుటుంబాల వారు మూడు నెలలు ఇంటికి దూరంగా ఉంటున్నారు. వందలాది కిలోమీటర్లు తిరుగుతూ ఎక్కడ చీకటిపడితే అక్కడే పొలాల్లో నిద్రిస్తున్నారు. సరైన భోజనం, నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి జీవాలకు సైతం తాగునీరు లభించని పరిస్థితి. వాగులు, వంకలు అందుబాటులో ఉంటేనే నీరు తాగిస్తున్నారు. తమ గ్రామాల్లో మేత దొరకగానే తిరుగుపయనమతారు.

ఇదే వృత్తిని నమ్ముకున్నాం



ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. ఏడాదిలో మూడు నెలలు బయటి ప్రపంచానికి దూరంగా ఉంటున్నాం. ఒక్కో మందకు నలుగురు కాపలాగా ఉంటారు. గుట్ట ప్రాంతంలో జీవాలను మేపుతూ తిరుగుతాం. గొర్రెల కాపరులను ప్రభుత్వం పట్టించుకోవాలి. – బరిడే పోతన్న, రాజూర

మేత దొరకక దూరప్రాంతాలకు



ఎస్సారెస్పీ నిండితే జీవాలకు మేత దొరకడం కష్టమవుతుంది. మేత కోసం దూరప్రాంతాలకు జీవాలతో వెళ్తుంటాం. వంట సామగ్రి తీసుకెళ్తాం. అటవీప్రాంతాల్లో జీవాలను మేపుతున్నాం. – గీజాగంగాధర్, ధర్మోర

పొలాల్లో గ్రాసం పెంచుకోవాలి

జీవాలు, పశువుల యజమానులు వారి పంట పొలాల్లో గ్రాసం పెంచుకోవాలి. జీవాలు, పశువులకు ఇన్సురెన్సును చేయించుకోవాలి. గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయిస్తున్నాం. పశువైద్యుల సూచనలు పాటించాలి. – రాజేశ్వర్, నిర్మల్ పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్

మద్యం షాపుల్లో చోరీ కేసు ఛేదింపు

- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్


వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్‌/ముథోల్‌: తానూరులోని మద్యం షాపుల్లో మందు బాటిళ్ల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం తాడ్‌బిలోలికి చెందిన యాపరి వినోద్ గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. తన బెల్టుదుకాణంలో మద్యం విక్రయం కోసం వైన్స్ షాపుల్లో దొంగతనాలను ఎంచుకున్నాడు. ఇందుకు తన సొంత జిల్లాలో చోరీ చేస్తే దొరికిపోతానని, నిర్మల్ జిల్లాపై ఫోకస్ చేశాడు. తన బెల్టుదుకాణం వద్ద మద్యం తాగేందుకు రెగ్యులర్‌గా వచ్చే బేగరి రోహిత్, సీరడి శ్రావణ్‌కుమార్, ఖదులూరి సాయి, ఆదిత్యగౌడ్, సట్ల నవీన్, దిలీప్‌తో జట్టు కట్టాడు. గత మే నెలలో ముథోల్‌లోని రాజరాజేశ్వర వైన్స్ షాపు వెనుక రేకులు తొలగించి మందు బాటిళ్ల చోరీకి పాల్పడ్డాడు. తానూరులోని శ్రీ లక్ష్మి వైన్స్‌షాపులోనూ అదే తరహాలో చోరీ చేశాడు. ఇలా చోరీ చేసిన మందు బాటిళ్లను తన బెల్టుదుకాణంలో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఇటీవల మరోమారు అదే తరహాలో చోరీ కోసం ముథోల్‌కు రాగా, అనుమానించిన పోలీసులు వారిని అదుపులో తీసుకున్నారు. ముథోల్‌లో రూ.2.50 లక్షలు, తానూరులోని వైన్స్ షాప్‌ల్లో రూ.80 వేల మద్యం బాటిళ్లను చోరీ చేసినట్లు విచారణలో గుర్తించామన్నారు. నిందితుడి బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సమావేశంలో ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడి ఆత్మహత్యకు కారకులపై కేసు నమోదు

వేమనపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారకులైన 13 మందిపై పోలీసు కేసు నమోదైంది. రుద్రభట్ల సంతోష్‌కుమార్, గాలి మధు, చింతకింది కమల, చెన్నూరి సమ్మయ్య, షబ్బీర్ ఆలీ, మంత్రి రమేష్, జడవెల్ల శారద, అద్దెరపల్లి రాజేశ్వరి, మానేపల్లి ప్రమీల, జంపం మారక్క, కొండపల్లి లక్ష్మి, మానేపల్లి మల్లేష్, నాయిని శైలజపై పోలీసులు కేసు నమోదు చేశారు. దసరా వేడుకల సందర్భంగా ఈ నెల 2న కాలనీలో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకున్నారు. మధుకర్ డయల్ 100కు ఫోన్ చేసి డీజే శబ్దం అసౌకర్యంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితులు మధుకర్ ఇంటికి వచ్చి అసభ్య పదజాలంతో దూషించారు. కొండపల్లి లక్ష్మి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఏట మధుకర్‌పై ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మధుకర్‌కు నీల్వాయి ఎస్సై ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌కు రావాలని తెలపడంతో మనస్తాపం చెంది శుక్రవారం గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

గుడిహత్నూర్: అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని మండల కేంద్ర సమీపంలోని తెలంగాణ దాబా వద్ద శనివారం హైవే పెట్రోలింగ్ సిబ్బంది పట్టుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి ఐచర్ వాహనంలో 27 ఆవులు, 4 ఎడ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆదిలాబాద్ సమీపంలోని భోరజ్ చెక్‌పోస్టు వద్ద మహిళా అధికారికి అనుమానంతో తనిఖీ చేయడానికి వస్తుండగా డ్రైవర్ ఆపకుండా వెళ్లాడు. ఈ విషయాన్ని హైవే పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ వెంటనే స్పందించి వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు. ఐచర్ వాహనంలో ఉన్న 27 ఆవులు, 4 ఎడ్లను ఇచ్చోడ సమీపంలోని గోశాలకు తరలించారు. కాగా, పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించలేదు.